సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 5 । మార్చి । 2025



పేదింట నిత్యావసరాల మంట

నిత్యావసరాల ధరలకు రెక్కలు రావడంతో పేదల ఇంట పప్పులు ఉడకనంటుంటే.. నూనెలు సలసలమంటున్నాయి. పప్పుల ధరలు మండిపోతున్నాయి. 8లో ▸





బంగారు నగల దోపిడీ

జంగారెడ్డిగూడెంలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ముగ్గురు దాడి చేసి బంగారు నగలు దోపిడీ చేశారు. దాదాపు 8 కాసులు దోచుకుపోయారు. 8లో ▸

న్యూస్‌రీల్

జిల్లా ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికుల సమ్మె



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులకు గత 5 నెలలుగా వేతనాలు అందకపోవడంతో మంగళవారం విధుల బహిష్కరించి ఆస్పత్రి ఆవరణలో సమ్మెకు దిగారు. దీంతో పారిశుద్ధ్య సేవలు నిలిచిపోవడంతో రోగులు, సహాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి వార్డులో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లు నిండిపోయి దర్శనమిచ్చాయి. దీంతో విషయం తెలుసుకున్న జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ పి.సూర్యనారాయణ ఆస్పత్రికి వచ్చి కార్మికులు, యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. 5 నెలలపాటు వేతనాలు ఇవ్వకపోతే ఇళ్లు ఎలా గడపాలని, ఏం తినాలని కార్మికులు ప్రశ్నించారు. పీఎఫ్ సొమ్ము కూడా ఇంతవరకు తమ ఖాతాలకు జమకాలేదని వివరించారు. దీంతో డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ ఈనెల 10 వరకు వేచి చూడాలని ఈ లోపు వేతనాలు జమవుతాయని కోరారు. చర్చలు సఫలీకృతం కావడంతో మధ్యాహ్నం నుంచి కార్మికులు విధుల్లోకి వచ్చి పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

ఇంటర్ పరీక్షల్లో 96 శాతం హాజరు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పేపర్-1 పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాల్లో జనరల్ కేటగిరీలో 18,315 మందికి 17724 మంది, ఒకేషనల్ కేటగిరీలో 2,226 మందికి 1,987 మంది పరీక్ష రాశారన్నారు. 96 శాతం హాజరు నమోదైందని తెలిపారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

ఆటో కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మినీ ట్రక్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఆధ్వర్యంలో మంగళవారం హౌసింగ్‌బోర్డు సెంటర్ వద్ద ఆటో కార్మికులు ధర్నా చేశారు. ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి మందలపర్తి హరీష్ మాట్లాడుతూ విచ్చలవిడి చలానాలతో డ్రైవర్లను వేధిస్తున్న జీఓ నెంబర్ 21, 31 రద్దు చేయాలన్నారు. వాహన మిత్ర రూ.15 వేలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన మోటారు యాక్ట్ చట్టం రద్దు చేయాలని తదితర డిమాండ్ల కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు కె.లక్ష్మీనారాయణ, తాడికొండ వాసు, కళింగ లక్ష్మణరావు, పి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ నిర్వహణకు డీఎన్నార్ ఎంపిక

భీమవరం (ప్రకాశంచౌక్): వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 నిర్వహణకు నోడల్ కాలేజీగా డీఎన్నార్ కళాశాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ తెలిపారు. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి కార్యక్రమంలో పాల్గొనే వారు తప్పనిసరిగా పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేయించుకున్న వారిలో 150 మందిని స్క్రీనింగ్ చేసి వారికి డీఎన్నార్ కళాశాలలో పోటీలు నిర్వహించి 10 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. పోటీలలో పాల్గొనేందుకు చివరి తేదీ మార్చి 9వ తేదీ అని.. వివరాలకు 8179179899, 9441388058 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎస్ఈ మోషేకు పదోన్నతి

ఏలూరు(మెట్రో): ఏలూరు సర్కిల్ ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్ జాన్ మోషేకు పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మోషేను అమరావతి సీఈగా పదోన్నతి కల్పించి తక్షణమే విధులకు హాజరుకావాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

మహారాష్ట్ర డైట్ బృందం పర్యటన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లా డైట్ కాలేజీ లెక్చరర్లు ఏలూరు జిల్లాలో అధికారిక పర్యటనకు విచ్చేశారు. మంగళవారం ఉదయం స్థానిక సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో టీచర్లతో పలు అంశాలను చర్చించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు మొండిచేయి

- రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులను పట్టించుకోని సర్కారు
- డీఏలు, సరెండర్ లీవులపై మౌనం
- ఉమ్మడి జిల్లాలో 80 వేల మంది పెన్షనర్లు, ఉద్యోగులపై ప్రభావం



ఏలూరు(మెట్రో): ఎన్నికల సమయంలో ఉద్యోగులపై వరాలు కురిపించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా కనికరం చూపడం లేదు. ఉద్యోగులకు అంత చేస్తాం, ఇంత చేస్తాం అని ప్రగల్భాలు పలికిన సర్కారు ఉద్యోగులను పట్టించుకోవడమే మానేసింది. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగుల ప్రస్తావనే రాకుండా బడ్జెట్ సమావేశాన్ని ముగించింది. ప్రతి పథకం అమలు చేయడంలో, అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకం. ఆ ఉద్యోగులను పట్టించుకోకపోవడంపై పెదవి విరుస్తున్నారు.

రూ.200 కోట్ల మేర బకాయిలు

ఉద్యోగులకు ఇప్పటికే వారి వేతనాలకు అనుగుణంగా 2.5 నుంచి 5.5 శాతం వరకు డీఏలు ఇవ్వాలి. ఉద్యోగులకు 2 డీఏలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ వీటిపై కూటమి సర్కారు నోరు మెదపడం లేదు. కేంద్ర ప్రభుత్వం మరో డీఏ ప్రకటిస్తే మూడు డీఏ బకాయిలు పేరుకుపోయే అవకాశం ఉంది. సరెండర్ లీవ్‌లు రెండు ఇవ్వాల్సి ఉండగా.. వాటి ఊసే బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. సరెండర్ లీవ్‌ల నిమిత్తం రూ.180 నుంచి రూ.200 కోట్ల మేర బకాయిలు ఉద్యోగులకు చెల్లించాలి. ప్రతీ ఉద్యోగి సరెండర్ లీవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఏపీ జీఎల్ఐ ఆధ్వర్యంలో లోన్ల ఫైనల్ క్లెయిమ్స్ పేరుకుపోయాయి. వీటిపై బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. రిటైర్ అయిన ఉద్యోగులకు 300 రోజుల సంపాదిత సెలవు ప్రస్తావన రాకపోవడం శోచనీయం. గ్రాట్యుటీ విషయంలోనూ అదే నిర్లక్ష్యపు ధోరణిని కూటమి సర్కారు ప్రదర్శిస్తోంది. జిల్లా వ్యాప్తంగా గత 8 నుంచి 9 నెలల కాలంలో సుమారు 800 మంది ఉద్యోగులు రిటైర్ అయినా వీరికి గ్రాట్యుటీ, ఆర్జిత సెలవులకు సంబంధించిన వేతనం నేటికీ లభించలేదు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు రూ.50 కోట్ల బకాయి

ఉద్యోగులకు వైద్య ఖర్చులు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు జిల్లాలో రూ.50 కోట్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఎక్కడికక్కడ దస్త్రాలు నిలిచిపోయాయి. ఉద్యోగులకు రూ. కోట్లాది రూపాయల బకాయిలు చెల్లించడంలో కూటమి సర్కారు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 వేల మంది ఉద్యోగులు, టీచర్లు విధులు నిర్వహిస్తుండగా, మరో 35 వేల మంది పెన్షనర్లు ఉన్నారు. వివిధ స్కీంలలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరో 15వేల మంది ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ కూటమి సర్కారు మొండి చేయి చూపింది.

సప్లిమెంటరీ బడ్జెట్ ప్రవేశపెట్టాలి



ఉద్యోగులకు మెడికల్ రీయిబర్స్‌మెంట్, డీఏలు చెల్లించాల్సి ఉంది. పెన్షనర్లకు గ్రాట్యుటీ, ఆర్జిత సెలవులు ఇవ్వాల్సి ఉంది. ఇటీవల బడ్జెట్‌లో ఉద్యోగులకు నిధుల కేటాయింపు లేదు. ఉద్యోగులకు సప్లిమెంటరీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి బకాయిలు చెల్లిస్తే ఉద్యోగులు ఆనందిస్తారు.

– చోడగిరి శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు

బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం



అధికారం చేపట్టి 9 నెలలు కావస్తున్నా ఉద్యోగులపై సర్కారు కనికరం చూపడం లేదు. పేరుకు పోయిన బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. జిల్లాలో ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. వాటిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలలి.

– కె.రమేష్‌కుమార్, చైర్మన్, ఏపీ జేఏసీ, అమరావతి

మా ఇంటిపై దాడి.. చింతమనేని కుట్ర

- చెరువుల లీజు విషయంలో నాకు సంబంధం లేదు
- మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



పెదవేగి: తన ఇంటిపై టీడీపీ శ్రేణుల దాడిని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తీవ్రంగా ఖండించారు. తోటలో పామాయిల్ గెలలు కోస్తుండగా, టీడీపీ శ్రేణులు అడ్డుకొని, అక్కడ పనిచేస్తున్న వారిని కొట్టారని, గొడవ జరగకుండా సముదాయించడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారని, ఇందులో పలువురికి గాయాలయ్యాయని ఆయన తెలిపారు. చేపల చెరువుల లీజు విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని, ఆ విషయం తాను ఎప్పుడో ప్రకటించినా.. అక్కడి గ్రామస్తులను బెదిరించి చింతమనేని కనుసన్నల్లో టీడీపీ నేతలు కొంతకాలంగా తన ఇంటి ముందు అక్రమ ఆందోళనలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశాంత వాతావరణాన్ని భంగపరిచేందుకు కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చింతమనేని దుర్మార్గ రాజకీయాలకు ఇది నిదర్శనమని తెలిపారు. రెడ్‌బుక్ రాజ్యాంగంపై ఉన్న శ్రద్ధను నియోజకవర్గ అభివృద్ధిపై పెట్టాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు దాడులకు భయపడవని, వారికి అండగా ఉంటానని, అధికారం శాశ్వతం కాదని గుర్తించాలని అబ్బయ్య చౌదరి స్పష్టం చేశారు.

తడబడిన పట్టభద్రులు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో 19,789 చెల్లని ఓట్లు
- పోలైన ఓట్లలో 9 శాతం చెల్లనివే

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రులు తడబడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 19,789 మంది చెల్లని ఓట్లు వేశారు. వీటిలో 42 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా ఉండటం గమనార్హం. ప్రతి రౌండ్‌లో సగటున 2,400పైగా చెల్లని ఓట్లు నమోదయ్యాయి. ఓటుపై అధికారులు అనేక అవగాహన సదస్సులు నిర్వహించారు. అభ్యర్థులు ప్రచారంలో కూడా ఓటు ఎలా వేయాలనేది గ్రాడ్యుయేట్లకు వివరించారు. అయినప్పటికీ వేల సంఖ్యలో చెల్లని ఓట్లు నమోదయ్యాయి. మొదటి రౌండ్‌లో 2,416, 2వ రౌండ్‌లో 2607, 3వ రౌండ్‌లో 2632, 4వ రౌండ్‌లో 2109, 5వ రౌండ్‌లో 2329, 6వ రౌండ్‌లో 2725, 7వ రౌండ్‌లో 2760, 8వ రౌండ్‌లో 2211 మొత్తం కలుపుకుని 19,789 చెల్లని ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల విధుల్లో సుమారు 2,700 మంది సిబ్బంది పాల్గొనగా కేవలం 243 మంది మాత్రమే పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. వీటిలో కూడా 42 చెల్లని ఓట్లు నమోదయ్యాయి. బ్యాలెట్ పేపర్‌లో ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయాలి. మొదటి ప్రాధాన్యత ఓటు అభ్యర్థి పేరు ఎదురు ఉన్న గడిలో 1వ నెంబర్, ప్రాధాన్యతను బట్టి 2, 3, 4 నెంబర్లు ఇతర అభ్యర్థులకు వేయవచ్చు. ఒకే అంకెను ఇద్దరికి వేసినా, 1 వేయకుండా 2, 3, 4 వేసినా నెంబర్లు కాకుండా రోమన్ నెంబర్లు వేసినా, అక్షరాలు రాసినా ఓటు చెల్లదు. ఎక్కువ మంది గ్రాడ్యుయేట్లు ఓటు వేయాలనుకున్న అభ్యర్థి పేరు వద్ద టిక్ పెట్టడం, రౌండ్ చుట్టడం, వారి సొంత పెన్నులు వినియోగించడం వంటి కారణాలతో వేల సంఖ్యలో ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. మొదటి మూడు స్థానాల్లో ఉన్న వారిని మినహాయిస్తే.. మిగిలిన 32 మందికి కలిపి 11,082 ఓట్లు పోలయ్యాయి. వారందరి ఓట్ల కంటే చెల్లని ఓట్లే అధికంగా ఉండటం విశేషం.

రుణాల మంజూరుకు జాబితాల రూపకల్పన

భీమవరం (ప్రకాశంచౌక్): ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయా కార్పొరేషన్ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగ రాణి మాట్లాడుతూ రుణాలు మార్చి 31లోపు గ్రౌండింగ్ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు రూ.25 కోట్లు మంజూరు కాగా, వీటిని మూడు నుంచి ఐదు మంది సభ్యులు కలిగిన గ్రూపులకు మంజూరు చేస్తామన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.25 లక్షలు మంజూరు చేస్తామని, దీనిలో 40 శాతం సబ్సిడీ, 40 శాతం టర్మ్ లోన్, 20 శాతం లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణాల మంజూరుకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు నిధులలో సుమారు 40 నుంచి 60 శాతం నిధులను సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేసేందుకు కేటాయించి, లబ్ధిదారులను గుర్తించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.పుష్పలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జయప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల విజయం

- 77,461 ఓట్ల మెజార్టీతో గెలుపు
- పీడీఎఫ్ అభ్యర్థికి 47,241 ఓట్లు
- 8 రౌండ్లలో ముగిసిన ఓట్ల లెక్కింపు



ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల బరిలో కూటమి అభ్యర్థి, పీడీఎఫ్ అభ్యర్థి మధ్య ప్రధాన పోటీ జరగ్గా.. మరో 33 మంది స్వతంత్రులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కూటమి పార్టీ బలపరిచిన టీడీపీ నేత పేరాబత్తుల రాజశేఖరం ఎమ్మెల్సీగా గెలుపొందారు. 1,24,702 ఓట్లు సాధించి సమీప ప్రత్యర్థి, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులపై 77,461 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. మొదట ప్రాధాన్యత ఓటులోనే 50 శాతం పైగా ఓట్లను సాధించడంతో విజేతగా ప్రకటించారు.

సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ముగిసింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను కట్టలు కట్టడానికే సమయం సరిపోయింది. రాత్రి 10 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ముగించారు. ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాలులో 28 టేబుల్స్ ఏర్పాటు చేసి 17 రౌండ్లు నిర్వహించేలా కట్టలు కట్టారు. అనంతరం ప్రతి టేబుల్‌కు వెయ్యి చొప్పున సగటున ప్రతి రౌండ్‌లో 28 వేల ఓట్లను లెక్కించి 8 రౌండ్లల్లో ఎన్నికల ప్రక్రియను ముగించేశారు. మొత్తం 2,18,997 ఓట్లు పోల్ కాగా వాటిలో 19,789 ఓట్లు చెల్లనవిగా నిర్ధారించారు. మిగిలిన 1,99,208 ఓట్లను మిగిలిన 8 రౌండ్లల్లో లెక్కించారు. ఎన్నికల బరిలో టీడీపీ అభ్యర్థి, పీడీఎఫ్ అభ్యర్థితో పాటు 35 మంది పోటీ చేశారు. వీరిలో స్వతంత్ర అభ్యర్థి, మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడు జీవీ సుందర్ మాత్రమే సత్తా చాటగా, మిగిలిన వారందరూ నామమాత్రంగా కూడా ఓట్లు దక్కించుకోలేదు.

30 గంటల పాటు కౌంటింగ్ ప్రక్రియ

గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపు 30 గంటల పాటు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. ప్రతి రౌండ్‌లోనూ కూటమి అభ్యర్థి ఆధిక్యం కొనసాగింది. పీడీఎఫ్ అభ్యర్థి మొదటి రౌండ్ నుంచి వెనుకంజలో ఉన్నారు. మొదటి రౌండ్‌లో 28 వేల ఓట్లు లెక్కించగా టీడీపీ అభ్యర్థికి 16,520, పీడీఎఫ్ అభ్యర్థి 5,815 ఓట్లు దక్కాయి. 8 రౌండ్లు కలిపి టీడీపీ అభ్యర్థికి 1,24,702 మొదటి ప్రాధాన్యత ఓట్లు రాగా.. పీడీఎఫ్ అభ్యర్థి 47,241 ఓట్లు దక్కించుకున్నారు.

సత్తా చాటిన జీవీ సుందర్

మాజీ ఎంపీ జీ.హర్షకుమార్ తనయుడు జీవీ సుందర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి మెరుగ్గా ఓట్లు సాధించారు. 8 రౌండ్లు కలుపుకుని 16,183 ఓట్లు దక్కించుకున్నారు. స్వతంత్రులుగా పోటీ చేసిన వారిలో కాట్రు నాగబాబు 565, షేక్ హుస్సేన్ 394, కట్టా వేణుగోపాలకృష్ణ 1017, కాండ్రేగుల నర్సింహం 364, కుక్కల గోవిందరాజు 269, కునుకు హేమకుమారి 956, కైలా లావణ్య 365, కొల్లు గౌతమ్ బాబు 317, చిక్కాల దుర్గారావు 665, నోరి దత్తాత్రేయ 565, యళ్ల దొరబాబు 303, పిప్పళ్ల సుప్రజ 479, బొమ్మిడి సన్నిరాజ్ 398, బందారు రామ్మోహనరావు 709, చిక్కా భీమేశ్వరరావు 254, వానపల్లి శివ గణేష్ 772, హోసేన్ షరీఫ్ 709 ఓట్లు దక్కించుకున్నారు. గెలుపొందిన టీడీపీ అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి డిక్లరేషన్ అందించారు.

అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు దారుణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము బలపరిచిన అభ్యర్థి దారుణంగా ఓడిపోవడంతో కూటమి నాయకులు జీర్ణించుకోలేక విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ రుద్రాక్షి ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు యూటీఎఫ్‌కు వైఎస్సార్‌సీపీ ముసుగువేస్తూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. వాస్తవానికి ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ అభ్యర్థులకు కూటమి ముసుగు వేయడం ద్వారా అధికార పక్షమే ఉపాధ్యాయ ఉద్యమంలో చీలికలు తెచ్చిందని విమర్శించారు. ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ స్వతంత్రంగా పోటీ చేసిందని దానికి యూటీఎఫ్, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. పీడీఎఫ్ ఏ పక్షం వహించకుండా మండలిలో స్వతంత్రంగా వ్యవహరిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై గళం ఎత్తుతుందన్నారు.

ఎస్సీ గుర్తింపు కోసం పోరాటం

- బేడ, బుడగ జంగం కులస్తుల అగచాట్లు
- ఎస్సీలుగా గుర్తించాలని తీర్మానం కేంద్రానికి పంపిన గత సర్కారు



కలెక్టర్ నాగరాణికి తమ సమస్య చెబుతున్న బేడ, బుడగ జంగం కులస్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): బేడ, బుడగ జంగం కులస్తులు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం కోసం ఏళ్ల తరబడి పోరాడుతూనే ఉన్నారు. గతంలో కొందరు కాంగ్రెస్ నేతలు బేడ బుడగ జంగం ఆంధ్రాలో లేరని కోర్టులో వేయడంతో వారికి ఎస్సీ రిజర్వేషన్ వర్తించకుండా నిలిపేశారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లాలో బేడ, బుడగ జంగం కులస్తులు పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టరేట్‌కు తరలివచ్చి తమ గోడు చెప్పుకున్నారు.

జిల్లాలో భీమవరం, వీరవాసరం, మొగల్తూరు, పాలకోడేరు, పాలకొల్లు మండలాల్లోని పలు గ్రామాల్లో బేడ, బుడగ జంగం కుటుంబాలు దాదాపు 700 వరకూ ఉన్నాయి. 4 వేల మంది జనాభా ఉన్నారు. రిజర్వేషన్ సర్టిఫికెట్ లేక విద్య, ఉద్యోగాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి అటు ఎస్సీ సర్టిఫికెట్ గానీ ఇటు బీసీ సర్టిఫికెట్ గానీ జారీ కావడం లేదు. దాంతో పిల్లల స్కూల్ అడ్మిషన్లకు ఇబ్బంది పడుతున్నారు. చదువుకున్న వారికి రిజర్వేషన్‌కు సంబంధించి నిర్ధారణ చేసే సర్టిఫికెట్ లేకపోవడంతో ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగులు రావడం లేదు. మహిళలు కూలి పనులు, ఇంటింటికి తిరిగి వస్తువులు విక్రయించడం, మగవారు గ్యాస్ పొయ్యిలు రిపేర్, కూలి పనులు చేసుకుని బతుకుతున్నారు.

చంద్రబాబు హామీ నిలబెట్టుకోవాలి

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బేడ, బుడగ జంగం కులస్తుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని వారికి సంక్షేమ పథకాలు అమలు చేసి అదుకున్నారు. వారికి ఎస్సీ రిజర్వేషన్ వర్తించేలా శాసన సభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. నేడు కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధులుగా ఉన్నారు వారు ఈ కులస్తుల సమస్య పట్టించుకోవడం లేదు. గతంలో బేడ, బుడగ జంగం కులస్తుల సభలో చంద్రబాబు మాట్లాడుతూ వారి సమస్య పరిష్కరించి ఎస్సీ రిజర్వేషన్ కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న చంద్రబాబు.. ఇచ్చిన మాటకు కట్టుబడి రిజర్వేషన్ కల్పించాలని కోరుతున్నారు.

పెన్షన్ రావడం లేదు



నాకు దివ్యాంగులైన పిల్లలు ఉన్నారు. వారికి పెన్షన్ రావడం లేదు. మాకు ఏ రిజర్వేషన్ సర్టిఫికెట్ లేదు. దివ్యాంగులైన పిల్లలతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మాకు గతంలో మాదిరిగానే ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేయాలి.

– కె.కుమారి, పెర్కిపాలెం

ఉద్యోగానికి అర్హత లేదు



నాకు ఎస్సీ రిజర్వేషన్ లేక ఏ పని ఉంటే ఆ పని చేసుకుని జీవిస్తున్నాను. మాలో చదువుకున్న యువత ఎస్సీ సర్టిఫికెట్ లేకపోవడంతో ఉద్యోగ అవకాశాలు లేక కూలి పనులు, ఇతర పనులపై బతుకుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి.

– కె.దుర్గ, పెర్కిపాలెం

గత ప్రభుత్వంలో తీర్మానం



బేడ, బుడగ జంగం కులస్తుల ఇబ్బందులు చూసి జగన్‌మోహన్‌రెడ్డి వారి ఎస్సీలుగా గుర్తించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. చిన పిల్లలు దగ్గర నుంచి వృద్ధుల వరకు రిజర్వేషన్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాలు సరైన నిర్ణయం తీసుకోవాలి.

– పెంద్ర వీరన్న, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్

16 ఏళ్లుగా పోరాటం



16 ఏళ్లుగా ఎస్సీ సర్టిఫికెట్ కోసం పోరాటం చేస్తున్నాం. గతంలో ఇచ్చిన ఎస్సీ రిజర్వేషన్‌ను న్యాయంగా అడుగుతున్నాం. సర్టిఫికెట్ లేకపోవడంతో పథకాలు, పదవులు అందడం లేదు. మా కులస్తుల ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం కావడం లేదు.

– కె. శ్రీనివాస్, బేడ, బుడగ జంగం జిల్లా కోఆర్డినేటర్

త్రీడి బయో ప్రింటింగ్ అద్భుతం



త్రీడి బయో ప్రింటింగ్‌పై విద్యార్థులకు వివరిస్తున్న నిపుణులు

తాడేపల్లిగూడెం: శరీరంలో ఏ అవయవం దెబ్బతింటే ఆ అవయవాన్ని ప్రయోగశాలలో కృత్రిమంగా తయారుచేయడానికి త్రీడి బయో ప్రింటింగ్ ఉపయోగపడుతుందని, ఇది ఓ అద్భుతం మంగళవారం నిట్‌లో జరిగిన కార్యక్రమంలో ఐఐటీ బయో ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ అశోక్‌కుమార్ అన్నారు. వైద్య రంగంలో త్రీడి బయో ప్రింటింగ్ ఓ సంచలనంగా మారనుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ భవిష్యత్‌లో నూతన అధ్యాయానికి నాంది పలకనుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవయవాలు దొరక్క ఇబ్బంది పడుతున్న కుటుంబాల్లో త్రీడి బయో ప్రింటింగ్ వెలుగులు నింపనుందన్నారు. కార్యక్రమంలో డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ రవికిరణ్‌శాస్త్రి, సుదర్శన్ దీప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

12న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా



కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ, కార్మిక సంఘం నాయుకులు

ఏలూరు (టూటౌన్): ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి రూ.12వేల నగదు, మూడు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.6లక్షలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రవి అన్నారు. పేదల సమస్యలపై ఈ నెల 12న విజయవాడలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేసారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.జీవరత్నం, తానా ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, ఎస్.మహంకాళిరావు పాల్గొన్నారు.

గాలాయగూడెంలో కోళ్ల మృత్యువాత



మృతి చెందిన కోళ్లు


దెందులూరు: మండలంలోని గాలయగూడెంలో కోళ్ల మృత్యువాతకు గురవుతున్నాయి. ఒక వైపు అన్ని ప్రాంతాల్లో వేల సంఖ్యలో కోళ్లు చనిపోవడం పశు వైద్యశాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడం విధితమే. చనిపోయిన కోళ్లను గాలాయగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన చెరువుగట్టు మీద ఉండటంతో కుక్కలు వచ్చి చనిపోయిన కోళ్లను పీక్కుతింటున్నాయి. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. పశు వైద్య శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యవేక్షణ చేయాలని చనిపోయిన కోళ్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కట్నం కోసం వేధిస్తున్నారని భర్తపై భార్య ఫిర్యాదు

ఉండి: వివాహమైన ఆరేళ్ల తరువాత కట్నం కావాలంటూ వేధింపులకు గురి చేస్తున్నారని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. వివరాల ప్రకారం ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన కంకిపాటి లక్ష్మీదుర్గకు, ఏలూరుకు చెందిన శ్రావణ్‌కుమార్‌తో 2019లో వివాహమైంది. ఈ నేపథ్యంలో భార్యను రూ.10 లక్షలు కట్నం తేవాలని వేధించేవాడు. అతనికి అత్తమామలు, ఆడపడుచులు సహకరిస్తూ శారీరక, మానసిక వేధింపులు చేసేవారు. గతేడాది డిసెంబర్ 12న లక్ష్మీదుర్గను ఇంటి నుంచి పంపేయడంతో చెరుకువాడలో తల్లిదండ్రులతో ఉంటుంది. ఈ మేరకు బాధితురాలు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదింట నిత్యావసరాల మంట

- ఆకాశాన్ని అంటుతున్న పప్పుల ధరలు
- సలసలమంటున్న నూనెలు
- కందిపప్పు పంపిణీకి సర్కారు ఎగనామం



కందిపప్పు



భీమవరం రైతుబజారులో మూతపడిపోయిన ప్రత్యేక కౌంటర్



తణుకులో మూతపడిన ప్రత్యేక కౌంటర్

సాక్షి, భీమవరం: పేదల్లో ఇళ్లల్లో నిత్యావసరాల మంట రాజుకుంటుంది. నిత్యావసరాల ధరలకు రెక్కలు రావడంతో పేదల ఇంట పప్పులు ఉడకనంటుంటే.. నూనెలు సలసలమంటున్నాయి. రేషన్ ద్వారా కందిపప్పు సరఫరాకు సర్కారు ఎగనామం పెట్టగా, ధరల నియంత్రణ కోసమంటూ గతంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. మార్కెట్‌లో పప్పుల ధరలు మండిపోతున్నాయి. కిలో కందిపప్పు రూ. 150 ఉంటే పెసరపప్పు రూ. 130, మినపప్పు రూ. 110 ఉంది. మరోవైపు పామాయిల్ ప్యాకెట్ రూ.140లు ఉండగా, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.150 ఉంది. జనవరిలో రూ.120 ఉన్న పామాయిల్ ఫిబ్రవరిలో రూ. 20 పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. అదే మాదిరి ఇతర నూనెల ధరలు పెరిగాయి. నిత్యావసరాలు లేనిదే రోజు గడవని పరిస్థితుల్లో పెరుగుతున్న ధరలు పేదలకు భారమవుతున్నాయి. ధరల నియంత్రణ దిశగా ప్రభుత్వం చొరవ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పత్తాలేని ప్రత్యేక కౌంటర్లు

నిత్యావసరాల ధరల నియంత్రణ కోసం సివిల్ సప్లయిస్ శాఖ ఆధ్వర్యంలో నవంబరులో జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు తదితర నియోజకవర్గ, మండల కేంద్రాల్లోని సూపర్ మార్కెట్లు, రైతు బజార్లు, ప్రైవేట్ దుకాణాల్లో 22 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. హోల్‌సేల్ ధరలపై ఉల్లిపాయలు, పామాయిల్, టమాట, బియ్యం తదితర సరుకుల అమ్మకాలు చేపట్టారు. పామాయిల్ రూ. 110కు, ఇతర సరుకులను బయటి మార్కెట్‌లో కంటే కొంతమేర తగ్గింపు ధరలకు విక్రయాలు చేశారు. అయితే నిర్వహణ సరిగా లేక కొద్దిరోజులకే చాలా చోట్ల ఇవి మూతపడిపోయాయి. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా ఇవి వినియోగంలో ఉన్న దాఖలాలు లేవు.

కందిపప్పు రాలేదు

జిల్లాలో 5.68 లక్షల రేషన్‌కార్డులు ఉండగా 356 ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం, పంచదార సరఫరా చేసేవారు. అక్టోబరు నుంచి కందిపప్పు పంపిణీ ప్రారంభించిన కూటమి ప్రభుత్వం ఐదు నెలలు తిరగకుండానే చేతులెత్తేసింది. జిల్లాలో 1,052 మంది రేషన్ డీలర్లు ఉండగా ప్రతినెలా 20వ తేదీలోపు సరుకుల కోసం అవసరమైన మొత్తానికి డీడీలు తీయాల్సి ఉంది. ఈ మేరకు నాలుగు నెలలు పాటు కార్డుదారులకు కిలో రూ. 67కు కందిపప్పు సరఫరా చేసింది. ఫిబ్రవరి నెలకు కందిపప్పు కోసం డీలర్లు డీడీలు తీయగా 568 టన్నులకు గాను కేవలం 110 టన్నులు మాత్రమే సరఫరా చేసింది. డీడీల్లోని మిగిలిన సొమ్ములను ఇతర సరుకులకు సర్దుబాటు చేశారు. అయితే మార్చి నుంచి ప్రభుత్వం పూర్తిగా కందిపప్పు సరఫరాను నిలిపివేసింది. ఈ నెలలో కందికప్పు కోసం డీడీలు తీయవద్దని సివిల్ సప్లయిస్ అధికారులు ముందుగానే డీలర్లకు సమాచారం ఇచ్చారు. గత నెలలో పూర్తిస్థాయిలో కందిపప్పు రాకపోవడంతో వచ్చిన సరుకును సరిగా పంపిణీ చేయకుండా కొందరు పక్కదారి పట్టించారన్న ఆరోపణలున్నాయి. కందిపప్పు కోసం ఎండీయూ వాహనాల ఆపరేటర్లను అడుగుతుంటే స్టాకు రాలేదని చెబుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. దీంతో కందిపప్పును బయటిమార్కెట్‌లో అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కాగా ఈ నెలకు సంబంధించి కందిపప్పు రాలేదని సివిల్ సప్లయిస్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు సరఫరాపై చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

కందిపప్పు కొనలేకున్నాం



రేషన్ షాపుల ద్వారా కందిపప్పు సరఫరా చేయకపోవడంతో బహిరంగ మార్కెట్లో అధిక ధరలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. మార్కెట్లో కొన్న కందిపప్పు నాణ్యంగా ఉండడం లేదు. రేషన్ షాపు ద్వారా కందిపప్పు సరఫరాను పునరుద్ధరించాలి.

– ఎ.సత్యవతీదేవి, ఆకివీడు

నిత్యావసరాల ధరలు పెరిగాయి



గత కొద్ది రోజులుగా నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి. దీంతో సామాన్య ప్రజలు సరుకులు కొనుక్కోవాలంటే భారంగా ఉంటుంది. కందిపప్పు, మినప్పప్పు అలాగే ఆయిల్ రేట్లు పెరిగాయి. నిత్యావసరాల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – బి చంద్రకుమారి, జున్నూరు పెద్దపేట

శ్రీవారి సేవలో కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్



జేసీ నిశాంతికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మంగళవారం రాత్రి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాన్ని పలుకగా, సూపరింటెండెంట్ రమణరాజు శ్రీవారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

కోళ్ల వ్యర్థాల వాహనాలు సీజ్

పెదపాడు: అక్రమ రవాణా చేస్తున్న కోళ్ల వ్యర్థాల వాహనాలను పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని వడ్డిగూడెం, తోటగూడేనికి కోళ్ల వ్యర్థాల వాహనాలు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వాహనాలను అడ్డుకుని వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సదరు వాహన డ్రైవర్ వాహన యజమాని చేపల చెరువు యజమానులపై కేసు నమోదు చేసి, కోళ్ల వ్యర్థాలను ధ్వంసం చేస్తామని ఎస్సై తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో క్లే, పెన్సిల్ ఆర్ట్ పోటీలు

నూజివీడు: స్థానిక ట్రిపుల్‌ఐటీలో మంగళవారం విద్యార్థులకు మట్టితో ప్రతిమలు తయారు చేయడం (క్లే ఆర్ట్), పెన్సిల్ ఆర్ట్ పోటీలను నిర్వహించారు. త్వరలో నిర్వహించనున్న వార్షికోత్సవం «సిగ్నస్»లో భాగంగా ఈ పోటీలను నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకతను మెరుగుపరిచే ఉద్దేశంతో నిర్వహిస్తున్నట్లు ఈ పోటీలను ప్రారంభించిన ఆర్జీయూకెటి రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కేవీడీజీ బాలాజీ అన్నారు. విద్యార్థుల్లోని కళాపోషణని బయటకి తీస్తూ, మన సంస్కృతిని తెలియజేయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. క్లే ఆర్ట్ పోటీలో విద్యార్థులు రూపొందించిన ప్రతి ప్రతిమ వెనుక ఒక కథను చెప్పేలా వారి కళాత్మకతను ప్రదర్శించారు. అలాగే పెన్సిల్ ఆర్ట్ పోటీల ద్వారా విద్యార్థులు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా అద్భుతమైన చిత్రాలను చిత్రీకరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ ఏఓలు బి.లక్ష్మణరావు, సతీష్, సిగ్నస్ కన్వీనర్ జె.సీతాపతి తదితరులు పాల్గొన్నారు.



క్లే ఆర్ట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ట్రిపుల్ ఐటీలో పలు వర్క్‌షాపులు

నూజివీడు: ట్రిపుల్‌ఐటీలో మంగళవారం పలు వర్క్‌షాపులు నిర్వహించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు సంబంధించి ఎలక్ట్రిక్ వెహికల్ తయారీపైన, పియూసీ విద్యార్థులకు క్రియేటివ్ డిజైన్ మాస్టరీ వర్క్‌షాపులను నిర్వహించారు. టెక్ జైట్-2025లో భాగంగా ఈ వర్క్‌షాపులను నిర్వహించామని నూజివీడు ట్రిపుల్‌ఐటీ ఏఓ బీ లక్ష్మణరావు పేర్కొన్నారు. పీయూసీ విద్యార్థులకు క్రియేటివ్ డిజైన్‌లో నిర్వహించిన వర్క్‌షాపులో సీనియర్ ప్రాడక్ట్ అండ్ గ్రాఫిక్ డిజైనర్ చోడిశెట్టి సూర్యత్రినాధ్ పాల్గొని డిజైన్ రంగంలో ఉన్న అవకాశాలు, మెరుగైన డిజైనింగ్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవడం, మార్కెట్‌లో ఉన్న డిమాండ్ తదితర అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సాంకేతికతను రైతులకు అందించాలి

తాడేపల్లిగూడెం: కృషి విజ్ఞాన కేంద్రాల్లోని వ్యర్థాలను పునర్వియోగ సాంకేతికతను రైతుల దరికి చేర్చాలని ఉద్యానవర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ కోరారు. వెంకట్రామన్నగూడెంలో మంగళవారం ఉద్యానవర్సిటీలో నిర్వహించిన శాస్త్రీయ సాంకేతిక సలహామండలి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ రైతుల పొలాల్లో జీవనియంత్రణ కారకాలు లేకుండా ప్రోత్సహించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంపై రైతులకు ఆసక్తి పెంచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రైతులకు క్షేత్రస్థాయిలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందించే దిశగా పనిచేయాలన్నారు. 2024-25లో సాధించిన ప్రగతి, 2025-26 సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యాచరణ గురించి చర్చించారు. కార్యక్రమంలో పరిశోధనాసంచాలకులు ఎమ్.మాధవి, గేదెల పరిశోధనాస్థానం హెడ్ కె.ఆనందరావు, జిల్లా ఉద్యాన అధికారి దేవా ఆనందకుమార్, జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు జడ్.వెంకటేశ్వరరావు, జిల్లా అభివృద్ధి అధికారి అనిల్‌కాంత్, డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ నరసయ్య పాల్గొన్నారు.



సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉద్యానవర్సిటీ వీసీ కె.గోపాల్, ప్రొఫెసర్లు

ఆర్థిక ఇబ్బందులతో ఆక్వా రైతు ఆత్మహత్య

నిడమర్రు: ఆర్థిక ఇబ్బందులతో ఆక్వారైతు నిమ్మల శ్రీను (42) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెదనిండ్రకొలను గ్రామంలో సంచలనం కలిగించింది. వివరాల ప్రకారం పెదనిండ్రకొలను గ్రామానికి చెందిన నిమ్మల శ్రీను గుణపర్రు గ్రామంలో ఆక్వా చెరువులు లీజుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఆక్వా చెరువుల్లో గ్యాస్ (అల్యుమినియం ఫాస్పైండ్ 56 శాతం) ట్యాబ్‌లెట్స్‌ను శ్రీను మింగేశాడు. అనంతరం సోదరుడు రామకృష్ణకు నేను ఆత్మహత్య చేసుకుని చనిపోతున్నట్లు మృతుడు ఫోన్ చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు మృతుని కోసం ఆరా తీయగా లీజుకు తీసుకున్న గుణపర్రు చెరువుల వద్ద ఉన్నట్లు తెలియడంతో అక్కడకు వెళ్లి గణపవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా అక్కడ డాక్టర్ల సూచనల మేరకు తాడేపల్లిగుడెం ఏరియా ఆసుపత్రికి తీసుకుని వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీను చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఇటీవల ఆశించిన స్థాయిలో ఆక్వా సాగు లేకపోవడం, ఇల్లు కట్టడంతో ఉన్న ఎకరం పొలం అమ్మేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మానసికంగా ఆందోళనే ఆత్మహత్యకు కారణమని స్థానికులు చెపుతున్నారు. మృతుడు సోదరుడు నిమ్మల రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు. మృతుడు శ్రీనుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.



నిమ్మల శ్రీను (ఫైల్)

అర్ధరాత్రి రోడ్డుపై ఆగిపోయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

దెందులూరు: మండలంలోని ముప్పవరం సోమవారం అర్ధరాత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రోడ్డుపై నిలిచిపోయింది. వివరాలను ప్రకారం వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే నవదిశా ట్రావెల్స్‌కు సంబంధించిన బస్సు సోమవారం సాయంత్రం వైజాగ్‌లో 35 మంది ప్రయాణికులతో బయలుదేరింది. అయితే అర్ధరాత్రి వంటి గంట సమయానికి ముప్పవరం వద్ద రిపేర్ వచ్చి ఆగిపోయింది. దీంతో ఆ సంస్థకు ఫోన్ చేయగా యజమాని దుర్భాషడాలరని ప్రయాణికులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్సై వెంటేశ్వరరావు బస్సు డ్రైవర్‌తో మాట్లాడి, యజమానికి విషయం తెలపడంతో మంగళవారం మీ సొమ్ములు చెల్లిస్తానని యజమాని చెప్పాడు. దీంతో ప్రయాణికులు రాత్రి సమయంలో వేరే బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.



అర్ధరాత్రి ఒంటిగంటకు నిలిచిపోయిన ట్రావెల్ బస్సు

బంగారు హారాన్ని పోగొట్టుకున్న భక్తురాలు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఒక భక్తురాలు మంగళవారం తన మెడలోని 5 కాసుల బంగారు హారాన్ని పోగొట్టుకుంది. బాధితురాలి కథనం ప్రకారం. పెదవేగి మండలం అంకన్నగూడెంకు చెందిన కోసూరి దుర్గా ప్రభావతి కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం శ్రీహరి కళాతోరణం వేదిక పక్కనున్న ప్రాంతంలో కొబ్బరికాయలు కొట్టి, తిరుగు ప్రయాణం అయ్యే క్రమంలో వాహనాల పార్కింగ్ ప్రాంతంలోకి వెళ్లారు. ఆ సమయంలో మెడలో బంగారు హారం లేకపోవడాన్ని ఆమె గమనించారు. కంగారు ఆమె తిరిగిన అన్ని ప్రాంతాల్లో వెతికినా ఫలితం దక్కలేదు. దాంతో దేవస్థానం అధికారులకు సమాచారం అందించగా, సిబ్బంది సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అయితే కొబ్బరికాయలు కొట్టే ప్రాంతానికి కూతవేటు దూరంలో ఉన్న మంచినీటి కుళాయి వద్ద, కింద పడి ఉన్న బంగారు హారాన్ని ఒక మహిళ తీసుకుని వెళ్లిపోయినట్టు సీసీ ఫుటేజీలో కనిపించింది. వెంటనే బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

లోక్‌అదాలత్‌లో బీఎస్‌ఎన్‌ఎల్ బిల్లుల కేసులను పరిష్కరించుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని బీఎస్‌ఎన్‌ఎల్ బిల్లుల బకాయిల కేసులను పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎల్ శ్రీను తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు జిల్లా, మండల న్యాయ సేవాధికార కమిటీలతో ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, తణుకు, భీమవరం, నరసాపురం పరిధిలోని లోక్ అదాలత్ కోర్టుల్లో ఈ నెల 8వ ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. వినియోగదారులు తమ బకాయిలను ముందుగానే చెల్లించాలనుకుంటే వారు తమ దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 94947 08898, 9490312777, 94404 33533 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

తప్పిపోయిన పిల్లల అప్పగింత

గణపవరం: తప్పిపోయిన ఇద్దరు బాలుర విషయమై గణపవరం పోలీసులు అత్యవసరంగా స్పందించడంతో వారిని గంటల వ్యవధిలోనే పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన 13 సంవత్సరాల వయస్సు ఉన్న ఇద్దరు బాలురు ఈ నెల 3వ తేదీ రాత్రినుంచి కనిపించకుండా పోయారు. వారికోసం కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లు గాలించినా ఫలితం లేకపోవడంతో ఆ పిల్లల అమ్మమ్మ పూడి కాంతమ్మ అర్ధరాత్రి 3 గంటలకు 112 నెంబరు ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే గణపవరం సీఐ ఎంవి సుభాష్, ఎస్సై మణికుమార్‌లు స్పందించి హెడ్‌కానిస్టేబుల్ రత్నప్రసాద్, పీసీ పి.కాంతయ్య, హెచ్‌సీ ఎం.సతీష్‌తో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి గాలించడంతో పిప్పర పరిసర ప్రాంతాలలో పిల్లలను గుర్తించి మంగళవారం ఉదయం పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆక్వా రైతులకు సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం మారితే సమస్యలు పరిష్కారం అవుతాయనుకుంటే ప్రభుత్వాధికారులు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆక్వా రైతులు మండిపడ్డారు. మంగళవారం పాలకొల్లు పట్టణంలోని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం సభ్యులు విలేకరు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అప్సడా సంఘాన్నే కొనసాగిస్తూ ఆనం రమణారెడ్డిని వైస్ చైర్మన్‌గా ఎంపిక చేశారని తెలిపారు. విజయవాడలో గత నెలలో ఏర్పాటుచేసిన ఆక్వా రైతుల సమావేశానికి మత్స్యశాఖ అధికారులు తమ సంఘానికి కనీస సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారికి తెలిసిన కొందరు రైతులకు సమాచారం ఇచ్చి చేతులు దులిపేసుకున్నారన్నారు. దీనిపై సంబంధిత స్థానిక మత్స్యశాఖ అధికారులను ప్రశ్నించగా అయ్యో మర్చిపోయానని చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రాసెసింగ్ ప్లాంట్ సభ్యులు ఒక యూనియన్‌గా తయారై ధరలను తగ్గించేస్తున్నారని వాపోయారు. ఫీడ్ కంపెనీలు ముడి సరుకు ధరలు తగ్గినా ఫీడ్ ధరలు మాత్రం తగ్గించడంలేదని తెలిపారు. ప్రభుత్వం ఆక్వా రైతుల సమస్యలు పట్టించుకోకుండా ఇబ్బందులు పెడితే ఆక్వా సాగు పెరగడం కాదని ఉన్న సాగునే క్రాప్ హాలిడేగా ప్రకటించే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆక్వా రైతుల సమస్యల పట్ల అప్సడా ఆధ్వర్యంలో కాకినాడలో ప్రాసెసింగ్ యూనిట్స్, ఫీడ్, హెచరీ కంపనీల సభ్యులతో సమావేశం ఏర్పాటుచేసి రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని సమస్య పరిష్కారం దిశగా పనిచేశారని రైతు సంఘం సభ్యులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బోణం నరసయ్య, ఎం జాన్‌రాజు, మేకా ఫణీంద్ర ప్రసాద్, పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు, సజ్జా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గాంధీభగవాన్‌రాజు

వృద్ధురాలిపై దాడి, బంగారు నగల దోపిడీ

జంగారెడ్డిగూడెం: ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి బంగారు నగలు దోపిడీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సాయి స్ఫూర్తి ఆసుపత్రి సమీపంలో ఒంటరిగా నివసిస్తున్న 70ఏళ్ల రిటైర్డ్ ఉర్దూ టీచర్ షేక్ ఫాతిమున్నీసా ఇంటికి గుర్తు తెలియని 40 నుంచి 45 వయసు కలిగిన ముగ్గురు వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో వచ్చినట్లు ఫాతిమున్నీసా తెలిపారు. ఇల్లు అద్దెకు కావాలంటూ ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఫాతిమున్నీసాపై దాడి చేశారు. ఆమె అరవకుండా నోరు నొక్కేసి ఆమె చేతికి ఉన్న 5 కాసుల బంగారు గాజులు, మెడలో ఉన్న 3 కాసుల చంద్రహారం దోపిడీ చేసుకుని వెళ్లిపోయారు. ఈ ఘటనలో ఫాతిమున్నీసా చేతికి తీవ్ర గాయం కాగా, స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్యులు సుమారు 8 కుట్లు వైద్యులు వేశారు. ఘటనపై ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు.



గాయపడిన రిటైర్డ్ ఉర్దూ టీచర్ షేక్ ఫాతిమున్నీసాబేగం

వైభవంగా పెద్దింట్లమ్మ జాతర

కై కలూరు: పంచహారతుల మధ్య కొల్లేటికోట పెద్దింట్లమ్మతల్లి దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దింట్లమ్మ జాతర మంగళవారానికి నాలుగో రోజుకు చేరింది. అమ్మవారికి పుష్పాలంకరణ, ధూప సేవ, బాలభోగం వంటి వైదిక కార్యక్రమాలు చేశారు. వస్త్ర, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదదాతలుగా ఆటపాకకు చెందిన వేగేశ్న ప్రసాదరాజు, గణపవరానికి చెందిన రుద్రరాజు పుల్లంరాజు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పెరికేగూడెంకు చెందిన శ్యామలాంబ కళానికేతన్ ఆధ్వర్యంలో త్రిరత్నాలు సాంఘిక ప్రదర్శన అహూతులను అలరించింది. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఈ నెల 13 వరకు జాతర జరుగుతుందని, జలదుర్గాగోకర్ణేశ్వరస్వామి దివ్య కల్యాణం ఈ నెల 10న నిర్వహిస్తామని స్పష్టం చేశారు.



పంచహారతుల కాంతులలో కొల్లేటికోట పెద్దింట్లమ్మ

రేషన్ బియ్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. రెండు వాహనాల్లోనూ 52 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పోలీసులు, రెవెన్యూ శాఖ సంయుక్తంగా జరిపిన దాడిలో మండలంలోని దేవులపల్లి నుంచి కాకినాడ జిల్లా పిఠాపురానికి ఒక వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో పిఠాపురం మండలం బి.పత్తిపాడుకు చెందిన కామిరెడ్డి వీరవెంకట్రావును అరెస్టు చేసినట్లు చెప్పారు. అలాగే జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట నుంచి మరొక వాహనంలో యర్రంపేటకు రవాణా అవుతున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో యర్రంపేటకు చెందిన నల్లమోతు సూర్యప్రకాష్‌ను అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై జబీర్‌తోపాటు సివిల్ సప్లయిస్ డీటీ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారులా ఇవి?

- నరకానికి నకళ్లుగా మారిన అత్తిలి రోడ్లు
- పట్టణంలో ప్రమాదభరితంగా మారిన వైనం
- ప్రధాన సెంటర్లన్నీ గోతులమయమే
- తణుకు నుంచి భీమవరం వెళ్లాలంటే నరకమే
- తరచూ ప్రమాదాలతో భయపడుతున్న వాహన చోదకులు


అత్తిలి మండలం కె సముద్రపుగట్టు వద్ద రహదారిపై రాళ్లులేచి ఉన్న దృశ్యం


అత్తిలి మండలం ఈడూరు వద్ద గోతులమయంగా ఉన్న రహదారి

అత్తిలి: మండలంలోని ప్రధాన సెంటర్ల రహదారులపై భారీగోతులు ఏర్పడడంతో ప్రజలు రోడ్లపై ప్రయాణించాలంటేనే వణికిపోతున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు నరకయాతన పడుతున్నారు. ప్రధాన రహదారుల పరిస్థితి చెప్పనవసరం లేదు. కనీసం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కూడా గోతులు పూడ్చే వారు కరువైపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. భీమవరం– అత్తిలి మార్గంలో ఆర్‌అండ్‌బీ రహదారి ఆధునీకీకరణ పనులు మధ్యలో నిలిపివేయడంతో ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇరగవరం మండలం గవర్లపాలెం నుంచి అత్తిలి గ్రామం వరకు ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దీనిలో భాగంగా ఇటీవల కాలంలో రహదారిని కంకర, మెటల్‌చిప్స్‌తో లెవెల్ చేశారు. నెలలు గడుస్తున్నా ఈరహదారిపై తారుతో లేయర్ వేయకపోవడంతో కంకరరాళ్లు పైకిలేచాయి. దీంతో ఈమార్గంలో నిత్యం ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు పైకిలేచిన రాళ్లవల్ల బైక్‌లు స్కిడ్‌అయి అదుపుతప్పి జారిపడిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గత నెలలో కె సముద్రపుగట్టు వద్ద కారు అదుపుతప్పి పంటబోదెలోకి దూసుకెళ్లింది. ఊకలోడుతో వెళుతున్న ట్రాక్టర్ చక్రం ఊడి బోల్తాకొట్టింది. ఈమార్గంలో భారీ వాహనాల రాకపోకల వల్ల దుమ్ము లేవడంతో ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన రోడ్డు ఆధునీకీకరణ పనులు పూర్తిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అత్తిలి నుంచి కొమ్మర, ఈడూరు మీదుగా భీమవరం వెళ్లే మార్గం గోతుల మయంగా ఉందని, రాత్రి సమయాల్లో వాహనాలు అదుపు తప్పి కింద పడి గాయాలు పాలైన సంఘటనలు ఇటీవల చోటు చేసుకున్నాయి. సంబంధితశాఖ అధికారులు ఈమార్గంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అత్తిలి మండల పరిధిలో ఇటీవల కాలంలో 8 రహదారుల మరమ్మతుల నిమిత్తం రూ. 80 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆర్‌అండ్‌బీ రహదారులలో ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


అత్తిలి మండలం కె సముద్రపుగట్టు వద్ద రోడ్డుపై బోల్తాపడిన ఊక ట్రాక్టర్(ఫైల్)


అత్తిలి మండలం కె సముద్రపుగట్టు వద్ద అదుపుతప్పి బోదెలోకి దూసుకెళ్లిన కారు(ఫైల్)

క్లుప్తంగా

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


యోగా కార్యక్రమాలు చేస్తున్న సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి

పెంటపాడు: ఈనెల 8న ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని, ఆరోగ్యం, విద్య, చిన్నారుల పోషణపట్ల శ్రద్ధ వహించాలని కోరారు. కె. పెంటపాడు గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ కిశోర్‌బాలికలు, అంగన్‌వాడీ వర్కర్లు, సబ్‌సెంటర్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీవీఆర్‌లో సంగీత కచేరీ


బీవీఆర్‌లో సంగీత కచేరీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): త్యాగరాజ స్వామి వారి 84వ ఆరాధనోత్సవాలు సందర్భంగా పట్టణంలోని బీవీఆర్‌లో జరుగుతున్న సంగీత కచేరీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. త్యాగరాజు గానసభ అధ్యక్షుడు గరికిపాటి బాపయ్య శర్మ పర్యవేక్షించారు. మృదంగ భానుడు శ్రీ మహదేవ్ లక్ష్మీనారాయణరాజు కళావేదిక ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వేణుగాన సభ జరిగింది. ఫ్లూట్‌పై తిరుపతికి చెందిన మండా అనంతకృష్ణ కచేరీ జరిగింది. వైలన్‌పై విజయవాడకు చెందిన పాలపర్తి నాగేశ్వరరావు, మృదంగంపై తిరుపతికి చెందిన పారుపల్లి బాల సుబ్రహ్మణ్యం, ఘటంపై సరస్వతుల హనుమంతరావులు సహకారం అందజేశారు. కళా కేంద్రం వ్యవస్థాపకుడు బుద్ధాల వెంకట రామారావు, కళాకారులు, సాహితీ సభ్యులు, త్యాగరాజ స్వామి భక్తులు పాల్గొన్నారు.

నలుగురిపై బైండోవర్


తాడేపల్లిగూడెం మండల మేజిస్ట్రేట్ కోర్టులో పాత నేరస్తులను హాజరుపర్చిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: డీపీఎల్ కేసుల్లో నలుగురిని మండల మేజిస్ట్రేట్ కోర్టులో బైండోవర్ చేసినట్లు తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. వారిలో సత్ప్రవర్తనకు ఏడాది కాలానికి రూ.1.50లక్షలు బాండ్ విలువకు బైండోవర్ చేసినట్లు వివరించారు. బైండోవర్ నిబంధనలను అతిక్రమిస్తే అపరాద రుసుం విధించివారిచే ప్రభుత్వ ఖజానాకు సొమ్ములు జమ చేయడంతో పాటు చట్ట ప్రకారం శిక్షతప్పదన్నారు. అక్రమంగా మద్యం విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

దాళ్వాకు నీటి ఎద్దడి ఉండదు


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ, ఏఓ

ఆకివీడు: దాళ్వా సాగుకు నీటి ఎద్దడి ఉండదని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏఓ ప్రియాంక చెప్పారు. స్థానిక సమతానగర్‌లో మంగళవారం పొలం బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాళ్వాలో రైతులు మూడు విడతలుగా ఎరువుల వాడకం పూర్తయిందన్నారు. ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదని చెప్పారు. వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉందన్నారు. మెట్ట ప్రాంతంలోమాసూళ్లు పూర్తి అవుతున్నందున డెల్టా ప్రాంతానికి నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

రేపు ధర్నాను విజయవంతం చేయాలి

కాళ్ల: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన విజయవాడలో చేపట్టే మహా ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలు విజయవాడ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ మంగళవారం కాళ్ల పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం నిర్వహించిన ఆశావర్కర్స్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భీమవరం డీఈ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించలేదన్నారు. 10ఏళ్లుగా పనిచేస్తున్నామని సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని విజ్ఞప్తి చేశారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

అత్తిలి: పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డా.కె.నరసింహారావు మంగళవారం తెలిపారు. ఈనెల 5న ఈడూరు, దంతుపల్లి, తిరుపతిపురం, 6న ఈడూరు, వరిఘేడు, 7న మంచిలి, వరిఘేడు, ఆరవల్లి, 8న అత్తిలి, మంచిలి, ఆరవల్లి, వరిఘేడు, 10న అత్తిలి, పాలూరు, లక్ష్మీనారాయణపురం, బల్లిపాడు, 11న పాలూరు, అత్తిలి, స్కిన్నెరపురం, బల్లిపాడు, 12న అత్తిలి, కంచుమర్రు, బల్లిపాడు, 13న అత్తిలి, బల్లిపాడు, 14న కె సముద్రపుగట్టు, గుమ్మంపాడు, 15న ఉరదాళ్లపాలెం, గుమ్మంపాడు, 17న పాలి, గ్రామాలలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. అత్తిలి మండలంలో పశు సంవర్ధకశాఖచే ఏర్పాటు చేసిన ఆరు టీంలు వ్యాక్సినేషన్ వేస్తారని తెలిపారు. పశువులకు ఈవ్యాధి నుండి రక్షించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడవచ్చని, తద్వారా పాల దిగుబడిని పెంచవచ్చునని పేర్కొన్నారు.

నేడు చికెన్ మేళా

తణుకు అర్బన్: పౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం చికెన్, ఎగ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ చైర్మన్ కోమట్లపల్లి వెంకట సుబ్బారావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక జాతీయరహదారి సమీపంలో ఉన్న నెక్ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ మేళాకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి హాజరవుతున్నట్లు చెప్పారు. కావున ప్రజలు ఈ మేళాకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పెనుమర్తి వెంకటరామన్నను సత్కరించిన కారుమూరి


తణుకులో మండల అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటరామన్నను సత్కరించిన మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వేల్పూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ మాజీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకటరామన్నను వైఎస్సార్ సీపీ తణుకు మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అభినందించారు. పార్టీ శ్రేణుల అభీష్టం మేరకు సౌమ్యుడు, సహయాక సంఘాన్ని రాష్ట్రంలోనే గర్వించదగిన విధంగా ఉన్నత స్థాయిలో నిలబెట్టిన వెంకటరామన్న పార్టీపట్ల విధేయతతో పనిచేస్తారని స్పష్టం చేశారు. అధ్యక్షుడిగా నియమితులైన వెంకటరామన్నకు పార్టీ శ్రేణులంతా సహకరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటరామన్న మాట్లాడుతూ తనపై నమ్మకముంచి తనకు ఈ బాధ్యతలు అప్పగించిన మాజీమంత్రి కారుమూరి నమ్మకాన్ని నిలబెడతానని, తణుకు మండలంలో పార్టీ అభివృద్ధికి తోడ్పడతానని చెప్పారు. పార్టీ కోసం పనిచేసే వారందరితో కలిసికట్టుగా తన ప్రయాణం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తణుకు మండలంలో పార్టీని పటిష్టతకు పాటుపడతానని చెప్పారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. టౌన్‌లోని శ్రీ వాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, అదే విధంగా పెంటపాడు జూనియర్ కళాశాలలో మంగళవారం మొదటి సంవత్సరం ఇంగ్లీషు–1 పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. 2,420 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 2361 మంది పరీక్షలకు హాజరైయారు. 59 మంది పరీక్షలు రాయలేదు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌లు పర్యవేక్షించారు.

ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణకు సత్కారం


తణుకులో సూర్యనారాయణను సత్కరించిన వాకర్స్ సభ్యులు

తణుకు అర్బన్: ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడలకు రిఫరీగా పాల్గొని తణుకు చేరుకున్న తణుకు మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సంకు సూర్యనారాయణను తణుకు వాకర్స్ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. గతనెలలో నిర్వహించిన జాతీయ క్రీడల్లో భాగంగా మోడరన్ పెంటథ్లాన్ (రన్నింగ్, స్విమ్మింగ్) పోటీల్లో రిఫరీగా బాధ్యతలను నిర్వర్తించి వచ్చిన సూర్యనారాయణను మంగళవారం తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాప్రాంగణంలో వాకర్స్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులు బొల్లాడ నాగరాజు, బళ్ల నాని మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుడిగా సూర్యనారాయణ ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్ది వారికి మంచి భవిష్యత్తును అందజేశారని కొనియాడారు. ఉపాధ్యాయుడైనప్పటికీ ఇప్పటికీ తను కూడా క్రీడాకారుడిగా అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో అవార్డులు సాధిస్తూ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఆధ్వర్యంలో సూర్యనారాయణకు శాలువా కప్పి పూలదండలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ బిక్కిన శ్రీధర్, రావుల రాంబాబు, అత్యం చంటి, ఆచంట ఫణికుమార్, సంగిరెడ్డి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, విజయ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రీజనల్ కోఆర్డినేటర్‌ను కలిసిన ‘గూడెం’ నాయకులు


వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణను కలిసిన తాడేపల్లిగూడెం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణను విజయవాడలో మంగళవారం తాడేపల్లిగూడెం మండలానికి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పరిణామాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కరిస్తానని రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ భరోసానిచ్చారు. జెడ్పీటీసీలు ముత్యాల ఆంజనేయులు, వరలక్ష్మి, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, నాయకులు గుండుబోగుల నాగు, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, చంద్రు శ్రీను, బుర్ల సుబ్బలక్ష్మి, నార్ని శంకరరావు, దారపురెడ్డి శ్రీనివాస్, మాకరాజు సతీష్, సబ్బితి బ్రహ్మయ్య, పచ్చా రామచంద్రయ్య, కవులూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం


వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. వాసవీ క్లబ్ 25వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఉచిత విద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 800 మందికిపైగా వైద్య పరీక్షలు చేశారు. వాసవిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పసుమర్తి అనిల్, మండ బ్రహ్మజీ, (పవన్), పులవర్తి రాంపండులు పర్యవేక్షించారు. కామినేని ఆసుపత్రి, చైతన్య ఎమర్జెన్సీ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యులు వై.నిశ్చల్, బి.దివ్యశ్రీ, ఎల్.వర్ధన్, ఎ.నరేంద్ర కుమార్‌ల పర్యవేక్షణలో న్యూరో, జనరల్ మెడిసిన్, కార్డియాలజిస్ట్, గుండె సంబంధిత వ్యాధులు, ఆయాసం, ఉబ్బసం, శ్వాసకోస వ్యాధులు, షుగర్, బీపీ, పక్షవాతం, 2డీ ఎకో, ఎలక్ట్రోథెరపీ, ఫిజియోథెరపీ, ఇసీజీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి సభ్యులు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి


మాధవరం ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మిసరస్వతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మిసరస్వతి మాట్లాడుతూ బాలికలకు యుక్త వయస్సు రాకుండా వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలు చేస్తే శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాలను గుర్తించాలన్నారు. అలాగే పోక్సో చట్టం, శిక్షలు గురించి వివరించారు. అనంతరం హెల్త్ హెచ్‌వీ యోగా ప్రాధాన్యత, ప్రయోజనాలను ఆసనాల ద్వారా తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి, యుహెచ్ఎస్ శిరోమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్.చంద్రావతి, వి. కనకమహాలక్ష్మి, కే.ఉదాలమ్మ, పి.హేమలత, ఎం. నాగమణి, ఎ.తులసీరాణి, ఎం.ముత్యాలు కుమారి, ఆర్. తులసీ కోమల, సూర్యనాగలక్ష్మి, విజయలక్ష్మి, అన్నపూర్ణ, జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి


ఎల్.అగ్రహారంలో పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: యువత సేవాభావం అలవర్చుకోవాలని వల్లీ మోహన్ యువజన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పటాన్ వలీ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్.అగ్రహారం ఇందిరమ్మ కాలనీలోని వల్లీ మోహన్ యువజన సేవా సమితి కార్యాలయంలో పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా పటాన్ వలీ మాట్లాడుతూ గత ఏడాది కాలంలో వలీ మోహన్ యువజన సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాటిని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. అధ్యక్షుడు ఉండ్రాజవరపు భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు అడపా తిలక్, కార్యదర్శి గొల్లేరు మోహన్, కోశాధికారి మెంటే రాంబాబు, బచ్చు దినేష్, జాలి దానయ్య, యువీ.సునీల, పటాన్ సుభాని, ఎస్‌కే. బాషా, పోలిశెట్టి రంగారావు, నేదూరి సత్యనారాయణ, కోడేటి శ్రీరామ్, కామిశెట్టి మూర్తి, భరణికల సత్యనారాయణ, కొప్పుల దుర్గాప్రసాద్, పోతుశ్రీనివాస్, దాసరి హరీష్, యడవల్లి మధు, యడ్లపల్లి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎస్‌డీ కళాశాలలో జాతీయ సదస్సు

తణుకు అర్బన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ఈనెల 6, 7 తేదీల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైఫ్ సైన్స్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో వ్యాధికారక స్వేచ్ఛ సూక్ష్మజీవులపై ఔషధ ఆవిష్కరణ, రోగ నిర్ధారణ సాధనాలపై జాతీయస్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యు. లక్ష్మిసుందరీబాయి తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత గోపాలన్

ఆకివీడు: వేసవి ప్రారంభంలోనే మంచినీటి కోసం చుక్కలు చూపిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ కార్యదర్శి జెఎన్వీ గోపాలన్ ధ్వజమెత్తారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం డొకల లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ ప్రజలకు మంచినీరందివ్వలేని దుస్థితిలో ప్రభుత్వాలున్నాయన్నారు. ఆర్వో నీరు కొనుగోలు చేసి తాగుతున్నా కనీసం వాడకానికి కూడా పనికిరాని నీటిని సరఫరా చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొన్ని గ్రామాల్లో ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్చలేదన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో స్థానం లేదని గోపాలన్ ఆరోపించారు. సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో ఏరియా కమిటీ కార్యదర్శి కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డి.రవితేజ, బీవీ వర్మ, బి.రాంబాబు, బి.కల్యాణి పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి చూపించాలి


దువ్వలో వ్యవసాయ కార్మికులకు సభ్యత్వం ఇస్తున్న వీరభద్రరావు

తణుకు అర్బన్: గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక ఉపాధి పనుల కోసం ఎదురు చూస్తున్న కూలీలకు తక్షణమే ఉపాధి పనులు చూపించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దువ్వ గ్రామంలో ఇంటింటికి వెళ్లి వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వం చేర్పించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ నిరంతరం వ్యవసాయ కూలీల హక్కుల పరిరక్షణ కొరకు పోరాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘంలో కూలీలందరూ సభ్యులుగా చేరాలని వీరభద్రరావు కోరారు. ఉపాధి హామీని నిర్వర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టేందుకు కూలీలు ఐక్యంగా పోరాడి ఉపాధి హామీని పరిరక్షించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దొంగల నాగేశ్వరరావు. బండారు వెంకటేశ్వరరావు. కామన నాగులు. తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): లింగ నిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు ఇస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.భానునాయక్ హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు ప్రోత్సహించేలా గోడ పత్రికలు, హోర్డింగులు, ప్రకటనలు చేయకుండా స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తారన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయమని అడిగిన వారు, ప్రోత్సహించిన వారు శిక్షార్హులని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి 27 మంది హాజరు


తణుకులో ఉచిత వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 27 మంది వృద్ధులు హాజరయ్యారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు హాజరై వృద్ధులకు వైద్య సేవలతోపాటు ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, ద్వారంపూడి బాపిరెడ్డి, కార్యదర్శి కోనూరి గాంధీ, సభ్యులు చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

తణుకు అర్బన్: ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ దల్లి రామాంజనేయులు రెడ్డి సౌజన్యంతో కొబ్బరి, మామిడి, నేరేడు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 100 జామ మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం రామాంజనేయులు రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3వేల మొక్కలు పంపిణీ చేసినట్లు చెప్పారు. దాతలు చిట్టూరి సుజాత, మన్నే రత్నకుమారి, నిడదవోలు సత్తిరాజు సౌజన్యంతో అందించిన అల్పాహారాన్ని పాఠశాలలో విద్యార్థులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టి.రామకృష్ణరాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పవతి, జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, అధ్యక్షురాలు కటారి శారదాదేవి, తణుకు మండల చైర్మన్ వీవీ రామకృష్ణ, కార్యదర్శి రామకాశి, కోశాధికారి అక్కిన విశ్వనాథం, జిల్లా కమిటీ సభ్యులు వీవీ హనుమంతరావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అత్తిలి: అత్తిలి గ్రామంలో వ్యక్తి అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన ఉల్లూరు గోపాలకృష్ణ అనే వ్యక్తి పెంటపాడు మండలం తాళ్లముదునూరుపాడు గ్రామంలో కౌలుకి వ్యవసాయం చేస్తున్నాడని, ప్రతి రోజు ఉదయం బస్సుకి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేవాడని, ఈనెల 1వ తేదీన వ్యవసాయ పనుల నిమిత్తం తాళ్ల ముదునూరుపాడు వెళ్లి తిరికి ఇంటికి రాలేదని, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని గోపాలకృష్ణ భార్య వేణు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రేమరాజు తెలిపారు.